# శ్రీ ఇస్మాయిల్, శ్రీ సి. పి. బ్రౌన్ పురస్కారాల ప్రదానోత్సవ సభ

కవి, విమర్శకులు శ్రీ తమ్మినేని యదుకులభూషణ్ గారు ప్రతిసంవత్సరం ప్రఖ్యాత కవి విమర్శకులు శ్రీ ఇస్మాయిల్ గారి జ్ఞాపకార్థం ఉత్తమ కవితా సంకలనానికి, తెలుగు భాషా వికాసానికి నిఘంటు నిర్మాణంలో, అనువాదంలో, చందశ్శాస్త్రంలో మహోత్కృష్ట మైన కృషి సల్పిన శ్రీ సి. పి. బ్రౌన్ మహాశయుని జ్ఞాపకార్థం ఆయా రంగాలలో దేనిలోనైనా ఒకదానిలో ప్రశంసార్హమైన కృషి చేసిన వారికి పురస్కారాలు గత నాలుగైదు సంవత్సరాలుగా అందించటం జరుగుతుంది. ముందుగా ఈ విధంగా తెలుగుభాషా సాహిత్యాలకు మెరుగైన సేవలందించే రచయితలను ప్రోత్సహిస్తున్న శ్రీ భూషణ్ గారిని "తెలుగుజ్యోతి" తరఫున అభినందిస్తున్నాము.

శ్రీ ఇస్మాయిల్ గారి పురస్కార ప్రదానానికి ఈ సంవత్సరం ఉత్తమ కవితా సంకలనంగా మా తెలుగుజ్యోతి సంపాదకవర్గం లో ఒకరైన డాక్టర్. వైదేహి శశిధర్ గారి "నిద్రితనగరం" గుర్తింపబడటం మాకెంతో సంతోషం. వారికి మా అభినందనలు.

అలానే శ్రీ సి. పి. బ్రౌ న్ గారి పురస్కారానికి ఈ సంవత్సరం చందశ్శాస్త్రంలో చేసిన విశేషమైన పరిశోధనాత్మక కృషికి గాను శ్రీ జెజ్జాల కృష్ణమోహనరావుగారు ఎన్నుకో బడ్డారు. వారికి మా అభినందనలు.

2009 నవంబర్ 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నుండి పురస్కార గ్రహీతలకు ప్రదానోత్సవ సభ డాక్టర్. వైదేహి శశిధర్ గారి స్వగృహంలో ఘనంగా జరిగింది. సభా నిర్వహణ ఏర్పాట్లన్నీ ఆమె భర్త శ్రీ శశిధర్ గారి పర్యవేక్షణలో సమర్థవంతంగా జరిగాయి. వారికి మా అభినందనలు.

శ్రీ భూషణ్ గారు పురస్కారాల గురించి సంగ్రహంగా వివరిస్తూ మాట్లాడారు. పురస్కార గ్రహీతలకు, సభికులకు ఆహ్వానం పలికారు. సభకు తెలుగు జ్యోతి సంపాదకులు శ్రీ భావరాజు మూర్తిగారు అధ్యక్షత వహించారు. పురస్కార ప్రదానోత్సవ సందర్భంగా ప్రముఖుల సందేశాలను (సి. ధర్మారావు, చేరా) సభాధ్యక్షులు భావరాజు మూర్తి గారు, రచయిత శ్రీనివాసరావు గారు చదివి వినిపించారు.

ఇస్మాయిల్ గారి గురించి, డాక్టర్. వైదేహి శశిధర్ గారి కవితా సంకలనం "నిద్రితనగరం" గురించి ప్రఖ్యాత కవి, రచయిత శ్రీ విన్నకోట రవిశంకర్ ప్రసంగించారు. శ్రీ ఇస్మాయిల్ గారితో తనకున్న పరిచయాన్ని సన్నిహితమైన పరిచయం గురించి, వారి కవితా వైశిష్ట్యం గురించి, వారి ఉన్నతమైన వ్యక్తిత్వం గురించి, వారి సునిశిత సాహిత్య విమర్శనా దృష్టి గురించి మాట్లాడారు. నిద్రితనగరం కవితా సంకలనం లోని కవితలను ఉదహరిస్తూ వారి చేతనా సౌకుమార్యాన్ని, అందమైన ప్రాకృతిక పదచిత్రాలను, ఆర్ద్రంగా వ్రాసే నేర్పును ప్రశంసించారు. వారి శైలీ లాలిత్యాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నారు. "ఈమాట" వ్యవస్థాపక సంపాదకులు శ్రీ కొంపెల్ల భాస్కర్ గారు చందశ్శాస్త్ర ఔన్నత్యాన్ని గురించి సంస్కృతంలో కాళిదాసు, భవభూతి లాంటి మహాకవుల కవితా శిల్పాన్ని గురించి, ప్రాచీనాంధ్ర కవులైన కవిత్రయం, పోతన గారల కవిత్వపటుత్వ సంపదల గురించి ప్రసంగించారు. పురస్కార గ్రహీతలైన జెజ్జాల కృష్ణమోహనరావుగారు చందశ్శాస్త్రంలో వారు చేసిన, చేస్తున్న పరిశోధనల గురించి విపులంగా ప్రసంగించారు. తెలుగు, కన్నడ చందో రీతుల మధ్య ఉన్న పోలికలను వివరించారు. చందశ్శాస్త్ర పరిశోధన కొన్ని సందర్భాలతో ప్రాచీనాంధ్రకవుల రచనల కాలనిర్ణయం చేయటానికి ఎలా తోడ్పడుతుందో వుదహరించారు. ఈ సందర్భంలో నన్నెచోడు నన్నయకు సమకాలికుడు కావటానికి అవకాశం ఉందన్నారు. తాను ఈ నాడు పొందిన పురస్కారం చందశ్శాస్త్రంకు, శాస్త్ర సేవలో నిమగ్నమైనవారందరికీ చెందుతుందని సవినయంగా నుడివారు.

డాక్టర్. వైదేహి గారు మాట్లాడుతూ తనకీ నాడు ప్రదానం చేయబడ్డ పురస్కారం కవులందరికీ చెందిందనీ, తనను ఈ సంవత్సరానికి ఇస్మాయిల్ గారి పురస్కారానికి ఎంపిక చేయటం తానొక గొప్ప గౌరవంగా భావిస్తున్నానని, వినమ్రతతో ఈ పురస్కారాన్ని స్వీకరిస్తున్నానని చెప్పారు. ఇస్మాయిల్ గారి సాహిత్యాభిలాష అనన్యమైన దని, వారి "కవిత్వం లో నిశ్శబ్దం" వారి సాహిత్యవిమర్శకనైశిత్యానికి అద్దం పడుతుందని, అది ఒక మంచి కవితలాగా, కథలాగా, నవలలాగా మాటి మాటికీ చదివించగల గొప్ప రచన అని, వారి విశ్లేషణా శైలి చదువరిని కట్టుకుని, ఆలోచింపచేసే అలరించగలదని, వారి వ్యక్తిత్వం ఉన్నత మానవీయ విలువలతో నిండిన సాహిత్యాభిమానులందరికీ స్ఫూర్తి దాయకమైనదని ప్రస్తుతించారు. ఆంధ్రభాషా సాహిత్యాలను ప్రోత్సహించేందుకు శ్రీ తమ్మినేని యదుకులభూషణ్ గారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఆఖరుగా రుచికరమైన ఆంధ్రా భోజనంతో విందు జరిగింది.

00000